
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 20 సెప్టెంబరు 2024



ముచ్చటిస్తూ..
సమస్యలను తెలుసుకుంటూ..

● ఏకలవ్య గురుకుల పాఠశాలలను సందర్శించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



మరిమడ్లలో విద్యార్థులతో మాట్లాడుతున్న బండి సంజయ్

ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాల, కోనారావుపేట మండలం మరిమడ్లలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ సమస్యలను తెలుసుకున్నారు. దుమాలలో దాదాపు మూడు గంటలపాటు పర్యటించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, విద్యార్థుల సంఖ్య, బోధన విధానం తదితర అంశాలపై ఆరా తీశారు. తరగతి గదుల్లోకి నేరుగా వెళ్లి పిల్లలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించారు. నివేదికను ప్రభుత్వానికి సమర్పించి మరింత మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట



ధరల దడదడ

- మండుతున్న నూనెల ధరలు
- ఘాటెక్కిన ఉల్లి
- వెల్లుల్లి కిలో రూ. 350
- సామాన్యుల బెంబేలు
- ధరలు నియంత్రించాలని సామాన్యుల విన్నపాలు

వంటింట్లో నిత్యావసరాల ధరలు సామాన్యులను దడపుట్టిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని పెంచుతున్నట్లు ప్రకటించడంతో మూడు రోజుల్లోనే భారీగా పెరిగిపోయాయి. మరోవైపు అన్ని వంటల్లో వాడే ఉల్లి, వెల్లుల్లి ధరలు సామాన్యులు అటువైపు ఆలోచించే పరిస్థితి లేకుండా ధరలు మండిపోతున్నాయి. కొన్ని కూరగాయలు కొనలేని పరిస్థితి ఉంది. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. జిల్లాలో నెల రోజుల క్రితంతో పోలిస్తే కొన్ని నిత్యావసర సరుకుల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగాయి.

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సలసల మరుగుతున్న వంట నూనెలు

చిన్న తాలింపు పెట్టాలన్నా నూనెతోనే మొదలవుతుంది. నూనెలు లేని వంట రుచించదు. పేదవాళ్ల నుంచి ధనికుల వరకు అందరూ వాడే నూనెలు బ్రాండెడ్ మినహా అంతా సమానమే. అలాంటి నూనెల ధరలు వారం రోజుల్లోనే లీటర్‌కు 20 రూపాయల వరకు పెరిగింది. కేంద్ర ప్రభుత్వం కస్టమ్ డ్యూటీ ముడి పామాయిల్, సన్‌ఫ్లవర్, సోయా నూనెలపై 20 శాతం విధించడంతో నూనెల ధరలు పెరిగాయి. శుద్ధి చేసిన నూనెలపై ఉన్న దిగుమతి సుంకాన్ని 12.5 శాతం నుంచి 32.5 శాతానికి పెంచారు. విదేశాల నుంచి నూనెలు దిగుమతి అయిన తరువాత శుద్ధి చేసి ప్యాకింగ్ పూర్తయి మార్కెట్‌లోకి రావడానికి కనీసం పది నుంచి 20 రోజుల పాటు పడుతుంది. కానీ వ్యాపారులు ముందస్తుగానే నూనెల ధరలు పెంచేశారు. సన్‌ఫ్లవర్ నూనె 110 నుంచి 130 వరకు పెంచారు. పామాయిల్ 95 నుంచి 120 వరకు పెరిగింది. పల్లి నూనె 170 నుంచి 210 వరకు, లోకల్ కంపెనీల నూనెలు పది రూపాయల వరకు పెంచారు. నూనెలు అంటేనే భయపడే పరిస్థితి వచ్చింది.

ఉల్లి కిలో రూ. 70

తుఫాను ప్రభావంతో మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రాలో కురిసిన వర్షాల వల్ల పంటలు దెబ్బతిని కూరగాయల ధరలపై కూడా ప్రభావం పడింది. ప్రధానంగా ఉల్లి ధర భారీగా పెరిగింది. పెద్ద రకం ఉల్లి కిలో 70 రూపాయల వరకు ధర పలికితే.. చిన్న రకం 50 రూపాయల నుంచి 60 రూపాయల వరకు అమ్ముతున్నారు. వెల్లుల్లి ధర గత నెలలో 200 రూపాయల వరకు ఉండగా ప్రస్తుతం కిలో 350 రూపాయలకు చేరుకుంది. జిల్లాకు ప్రధానంగా ఉల్లిగడ్డలు మహారాష్ట్ర నుంచి ఎక్కువగా సరఫరా అవుతాయి. అక్కడ తుఫాను కారణంగా పంటలు దెబ్బతినడంతో ధరలు పెరిగాయి. కూరగాయల ధరలు కూడా పెరుగుతూ వస్తున్నాయి. బీరకాయలతో పాటు కొన్ని ఎక్కువగా ఉండగా, కొన్ని కూరగాయల ధరలు అందుబాటులో ఉన్నాయి. కొత్తిమీర కిలో 400 రూపాయలు అమ్ముతున్నారు. ఏటు చూసినా సామాన్యుడికి ధరలు చూసి ఆందోళన చెందుతున్నారు.

ధరలను నియంత్రించాలి...
పడిగెల రేణుక, ఓబులాపూర్



సామాన్యులకు ఇబ్బందికరంగా మారిన నిత్యా వసర సరుకుల ధరలను ప్రభుత్వం నియంత్రించాలి. మధ్య తరగతి ప్రజల ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంటుంది. అలాంటి వారికి రోజురోజుకు పెరుగుతున్న ధరలు అందుబాటులో ఉండే విధంగా చూడాలి.

సబ్సిడీపై నూనెలు అందించాలి...
కుర్ర రాధ, ఇల్లంతకుంట



రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీపై నూనెలు, ఇతర నిత్యావసర సరుకులను అందించాలి. అన్నింట్లో వాడే నూనెలు కొనాలంటేనే భయం వేస్తోంది. నూనెలు కూరగాయల ధరల పెరుగుదల నియంత్రణ లేకుండా ఉంది. పేద వర్గాలకు ఇబ్బంది కరంగా ఉంటుంది.

ప్రభుత్వం రంగంలోకి దిగాలి...
అలూరి మమతారెడ్డి, తిప్పాపూర్



ధరలు పెరిగినపుడు ప్రభుత్వం చొరవ చూపాలి. అవసరమైన రాయితీలు, పన్నుల తగ్గింపులు చేయాలి. పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంటే వారి జీవనం సాఫీగా సాగుతుంది.

ఉల్లిగడ్డల ధరలు పెరుగుతున్నాయి...
శ్రీనివాస్, హోల్‌సేల్ వ్యాపారి



కర్నాటక, మహారాష్ట్రలో వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతో ఉల్లి, వెల్లుల్లి ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. వారంరోజుల క్రితం కిలో ఉల్లిగడ్డ 40 రూపాయలు ఉండగా ప్రస్తుతం 60 రూపాయల నుంచి 70 రూపాయల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. వెల్లుల్లి ధర కూడా కిలో 350 రూపాయల వరకు ఉంది. గడిచిన 20 రోజుల్లోనే వంద రూపాయలు పెరిగింది.

రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇవ్వండి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, సెప్టెంబరు 19: మోత్కరావుపేట- చందుర్తి రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖను లేఖ ద్వారా గురువారం కోరారు. జగిత్యాల జిల్లా భీమారం మండలం మోత్కరావుపేట నుంచి చందుర్తి మండల కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం పూర్తయితే రెండు మండలాల మధ్య ప్రయాణం సులువు అవుతుందన్నారు. దాదాపు నాలుగు కిలోమీటర్ల అటవీ భూమికి అనుమతిని ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు పెండింగ్‌లో పెట్టారని, అటవీ శాఖ నుంచి అవసరమైన అనుమతులు ఇవ్వాల్సిందిగా కోరారు. మేడిపల్లికి అనుసంధానంగా ఉండే ఈ రహదారి ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. భీమారం, చందుర్తి మండల ప్రధాన కార్యాలయాలకు, వేములవాడ రాజన్నను సందర్శించే యాత్రికులకు మరింత సౌకర్యవంతం అవుతుందన్నారు. రహదారి నిర్మాణంతో హైదరాబాద్‌కు ప్రయాణ దూరం సుమారుగా 35 కిలోమీటర్లు తగ్గుతుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు సూచించవలసిందిగా, అవసరమైన అనుమతులు పొందే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంచుకోవాలి

- జిల్లా సైన్స్ అధికారి దేవయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 19: ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలో పాల్గొంటూ నైపుణ్యాలను పెంచుకోవాలని జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య సూచించారు. మండలంలోని గాలిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు మేకల పావణి ఆధ్వర్యంలో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతు ఇన్‌స్పైర్ మానక్‌లో ప్రతీ పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులను తప్పనిసరిగా నామినేషన్ చేయాలని సూచించారు. ఎన్‌ఏఎస్ పరీక్షలో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచి జిల్లాను ముందు వరుసలో ఉంచాలని సూచించారు. నూతనంగా వస్తున్న బోధనా పద్ధతులను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా టీబీఎస్‌ఎఫ్ మండల అధ్యక్షుడిగా మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా రాజును ఎన్నుకున్నారు. అనంతరం జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ మహేష్‌చంద్ర. యాద రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 19: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని పలువురు కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. మండలంలోని దుమాలకు బండి సంజయ్ రాగా విషయం తెలుసుకున్న పలువురు అక్కడికి చేరుకొని తమ సమస్యలను పరిష్కరించాలంటూ మొర పెట్టుకున్నారు. పాఠశాలలో 13 ఏళ్లుగా ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వర్తిస్తున్న తమను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించాలని ఉపాధ్యాయులు, సిబ్బంది విన్నవించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. రాజన్నపేట మాజీ ఎంపీటీసీ రజిత-రవినాయక్ దంపతుల కొడుకు అశ్వంత్ జన్మదిన వేడుక సందర్భంగా మంత్రి సంజయ్‌కుమార్‌ను కలిశారు. మిఠాయి తీసుకోవాలని కోరడంతో బాలుడు అశ్వంత్‌కు ఆయన తినిపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముస్తాబాద్, సెప్టెంబరు 19 : మండల కోఆప్షన్ మాజీ మెంబర్ ఎండీ నజీర్ ఇటీవల గుండెపోటుతో మరణించగా బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య గురువారం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. అకస్మాత్తుగా చనిపోవడంపై విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ మాజీ మెంబర్ ఎండీ సర్వర్‌పాషా, నాయకులు నందు రావు, గణేశ్, జహంగీర్ తదితరులు ఉన్నారు.

మిడ్ మానేరులో 25.04 టీఎంసీల నీరు

బోయినపల్లి, సెప్టెంబరు 18 శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ ఇన్ ఫ్లోను నిలిపివేశారు. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200 క్యూసెక్కుల నీటి విడుదల కొన సాగుతోంది. ప్రాజెక్టు పూర్థి స్థాయి నీటిమట్టం 318 మీటర్లగాను ప్రస్తుతం 317.02 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 25.04 టీఎంసీల మేరకు నిల్వ ఉంది.

అన్నపూర్ణకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 19: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటి ఎత్తిపోలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.02 టీఎంసీలకు చేరుకున్నాయి. మధ్యమానేరు ద్వారా వచ్చిన 3,200 క్యూసెక్కుల నీటిని ఒక పంపు ద్వారా ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రాజన్న ఆలయ అభివృద్ధి

- భక్తులకు సులభంగా, వేగంగా దర్శనం కల్పించాలి
- సమీక్షా సమావేశంలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 19: మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని అధికారులను దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిపై మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి గురువారం సచివాలయంలోని దేవాదాయ మంత్రిత్వశాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ప్రధాన దేవాలయాల్లో రాజన్న ఆలయం ఒకటన్నారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు వేగంగా, సులభంగా దర్శనం జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆలయానికి ప్రత్యేకంగా ఆర్కిటెక్ట్‌ను నియమించి పక్కా ప్లాన్ ప్రకారం ఆలయ నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఆలయానికి ఆర్కిటెక్ట్‌ను నియమించి, ఆలయానికి ఇప్పటికే కేటాయించిన రూ. 50 కోట్లతో శృంగేరి పీఠం అనుమతి పూర్తి అయిన సందర్భంగా పనుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సూచించారు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా ఆలయ పనులు పూర్తయిన తర్వాత బ్యాంకు లాకర్‌లో వున్న బంగారంతో రాజన్న ఆలయాన్ని బంగారం తాపడంతో తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. రాజన్న సన్నిధిలో కార్తీక మాసంలో ప్రతీ సోమవారం కోటీ దీపోత్సవం నిర్వహించేలా చూడాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి దేవాలయంలో సింథటిక్ శాలువాలు వాడకుండా చేనేత శాలువాలు, బ్యాగులు వాడేలా ఆదేశాలు ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఆలయాల స్థపతి వల్లి నాయగన్ తదితరులు ఉన్నారు.

అనంతగిరి నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, సెప్టెంబరు 19: అనంతగిరి నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తానని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు. ముత్యాల పోచమ్మ వార్షికోత్సవంలో గురువారం పాల్గొన్న అనంతరం సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇప్పటికీ అనేక మంది నిర్వాసితులకు సరైన పరిహారం అందలేదన్నారు. ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టినప్పుడు నిర్వాసితులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామస్థుల కోరిక మేరకు ప్రాజెక్టుకు పోచమ్మ పేరుకూడా పెట్టలేదన్నారు. పునరావాస కాలనీలో పేరుకుపోయిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే నిరుపేదలకు అండగా ఉండే ప్రభుత్వం అన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, ఐలయ్య, నాయకులు వినయ్‌కుమార్, పసుల వెంకటి, రాజేందర్‌రెడ్డి, రజనీకాంత్, గోపాల్, అంతగిరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి పోచమ్మ ఆలయాభివృద్ధికి కృషి

అనంతగిరి గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆలయంలో జరుగుతున్న వార్షికోత్సవంలో గురువారం పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికగా మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆలయానికి రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతున్నందున సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఐరెడ్డి చైతన్యమహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు ప్రసాద్, నాయకులు గోపాల్, రజనీకాంత్, అంతగిరి, నరేష్, నవీన్, ఆనందరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కేశవరెడ్డి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్ల నియామకానికి ఇంటర్వ్యూలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 19: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రిన్సిపల్ ప్రభుత్వం మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్స్ అసోసియేట్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను కాంట్రాక్ట్ పద్ధతిలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరిగాయి.

కలెక్టర్ సందీప్‌కుమార్ ఝ అధ్యక్షతన, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆధ్వర్యంలో అభ్యర్థుల ఇంటర్వ్యూయులు, అర్హత జాబితాలను పరిశీలించారు. కాంట్రాక్ట్ పద్ధతిలో మొత్తం 69 పోస్టులకుగాను కేవలం 19 మంది అభ్యర్థులు మాత్రమే పాల్గొన్నారు. వారికి కమిటీ సభ్యులు ఇంటర్వ్యూయులు నిర్వహించి ప్రొఫెసర్లు- 2, అసోసియేట్ ప్రొఫెసర్లు-1, అసిస్టెంట్ ప్రొఫెసర్- 10, సీనియర్ మెడికల్ ఆఫీసర్- ఆరు మంది కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ జీఎంసీ ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, జీజీహెచ్ జిల్లా సభ్యులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం వసంత్‌రావు, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి, ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్, కరికులం కమిటీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో మహిళల ధర్నా



గ్రామ పంచాయతీ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 19: మూడు నెలలుగా కుళాయిల్లో నీళ్లు రావడం లేదని తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్ ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి కోసం కార్యదర్శిని సంప్రదించినా పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సీ కాలనీలోని పాడైపోయిన బోరును మరమ్మతు చేయించాలని అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కుళాయిల్లో నీరు సరఫరా అయ్యేలా చూడాలని, లేదా బోరు మరమ్మతులు చేసి తాగునీటిని సరఫరా చేయాలని అధికారులకు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు పాల్గొన్నారు. ఈ విషయాన్ని ఎంపీవో మీర్జా దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ట్యాంకర్‌ను పంపించి ఎస్సీ కాలనీలో నీటి సరఫరా చేయించారు. అలాగే మాజీ ఎంపీటీసీ భైరనేని రాము స్పందించి బోరు మోటారు త్వరగా మరమ్మతులు చేయించి సాయంత్రం బోరుబావికి బిగించారు.

గడువులోగా సీఎంఆర్ అందించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

వేములవాడ, సెప్టెంబరు 19: నిర్ణీత గడువులోగా సీఎంఆర్ ఇవ్వాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ రైస్ మిల్లుల యజమానులను ఆదేశించారు. వేములవాడలోని పలు రైస్ మిల్లులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులలో బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఆయా రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం, ఇప్పటి వరకు ఇచ్చిన సీఎంఆర్ వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లర్లు తమకు ఇచ్చిన లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పెంచబోమని స్పష్టం చేశారు. జిల్లా పౌర సరఫరాల అధికారి వసంత లక్ష్మీ తనిఖీల్లో పాల్గొన్నారు.



వేములవాడలో రైస్ మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్


సభ్యత్వ నమోదులో అగ్రగామిగా నిలవాలి

బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 19: బీజేపీ సభ్యత్వ నమోదులో మండలం అగ్రగామిగా నిలవాలని కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముస్కానిపేట గ్రామంలో గురువారం సభ్యత్వ నమోదను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కృష్ణారెడ్డి మాట్లాడారు. అన్నివర్గాల ప్రజలను పార్టీలో చేర్పించాలని సూచించారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, ముత్యాల జగన్‌రెడ్డి, సొల్లు అజయ్‌వర్మ, కొమురయ్య, వెంకటరెడ్డి, ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి, మ్యాకల మల్లేశం, సంపత్, సాయగౌడ్, ముత్తక్క, అనీల్, శ్రీకాంత్‌లతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.









జ్వరంతో మహిళ మృతి

చిగురుమామిడి, సెప్టెంబరు 19: చిగురుమామిడికి చెందిన సిరవేణి శిరీష (30) అనే మహిళ గురువారం జ్వరంతో మృతి చెందింది. శిరీష వారం రోజు లుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. స్థానికంగా చికిత్స తీసుకున్న ప్పటికీ తగ్గలేదు. గురువారం తీవ్ర జ్వరంతో అపస్మారక స్థితికి చేరింది. కుటుంబ సభ్యులు హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తర లించారు. వైద్యులు శిరీషను పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. త న కూతురు జ్వరంతోనే మృతి చెందిందని తండ్రి పర్షరాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బండి రాజేశ్ తెలిపారు.



















ప్రైవేటు ఆసుపత్రిలో రోగి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ

జగిత్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గొల్లపల్లి రోడ్డు లో గల ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స కోసం ఆపరేషన్ థియేటర్‌కు తీసుకవెళ్లిన రోగి మృతి చెందిన సంఘటన గురువారం కలకలం రేపింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే ఆపరేషన్ గదిలో రోగి మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేశారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిని నిలదీశారు. మల్యాల మండల కేంద్రానికి చెందిన వంగల మహిత (38) మూడు రోజుల క్రితం గర్భసంచి నొప్పితో ఆసుపత్రిలో చేరింది. ఆమెకు శస్త్ర చికిత్స నిర్వహించాలని వైద్యులు నిర్ణయించారు. శస్త్ర చికిత్స కోసం మత్తు ఇంక్షన్ ఇవ్వగానే మహిళ గుండెపోటుకు గురై మృతి చెందిందని బంధు వులకు వైద్యులు తెలిపారు. ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మహిత మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఐఎంఏ నేతలు ఆసుపత్రికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. బాధిత కు టుంబానికిన్యాయం చేస్తామని ఆసుపత్రి నిర్వాహకులు హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమనిగింది. కాగా మృతురాలు మహితకు భర్త రమేశ్, కూతురు మైథిలి, కుమారుడు సాయి ఉన్నారు.

దాడికి పాల్పడిన ఒకరిపై కేసు నమోదు

జమ్మికుంట, సెప్టెంబరు 19: జమ్మికుంట మండలం వావిలాల గ్రామానికి చెందిన పెరుగు శ్రీనివాస్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు. పెరుగు శ్రీనివా స్-సుజాత దంప తుల కుమార్తెకు గత నెల నిశ్చితార్థం జరిగింది. శ్రీని వాస్ ఈ నెల 18న గ్రామంలోని చికెన్ సెంటర్ వద్ద కూర్చొని ఉన్నాడు. అదే సమయంలో అక్కడికి మద్యం సేవించి వచ్చిన పెరుగు సిజిత్ తన ను నిశ్చితార్థానికి పిలువ లేదంటూ గొడువకు దిగాడు. పక్కనే ఉన్న కర్ర తీసుకోని శ్రీనివాస్‌పై దాడి చేయడంతో గాయాలయ్యాయి. శ్రీనివాస్ భా ర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రవి తెలిపారు.

ధరణి ఆపరేటర్‌పై తహసీల్దార్‌కు ఫిర్యాదు

శంకరపట్నం, సెప్టెంబరు 19: గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమి పత్రాలు ఇవ్వడం లేదని ధరణి ఆపరేటర్‌పై గురువారం కరీంపేటకు చెం దిన మేడిశెట్టి బక్కవ్వ కుటుంబ సభ్యులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కరీంపేట గ్రామానికి చెందిన మేడిశెట్టి బక్కవ్వ వ్యవసాయ భూమిని ఆమె కోడళ్లు మేడిశెట్టి రాజమ్మ, మేడిశెట్టి స్వరూప, మనుమడు మేడిశెట్టి రాకేష్, మనమరాళ్లు స్వప్న, రజిత, స్రవంతి, వనమల పేరిట చేసేందుకు గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం ఇటీవల ఓ ప్రైవేట్ వ్యక్తి వద్ద స్లాట్ బుక్ చేసుకున్నారు. ఆ తేదీ ప్రకారం తహసీల్దార్ కార్యాలయంలో వీరు పేరు మీద బక్కవ్వ పేరు నుంచి గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ తహసీల్దార్ భాస్కర్ చేశారు. అదేరోజు సాయంత్రం డాక్యుమెంట్లు ఇవ్వకుండా సాంకేతిక కార ణాలు ఉన్నాయని చెప్పారు. అనంతర పలుమార్లు తహసీల్దార్ కార్యాల యానికి వచ్చినా సిబ్బంది ఇవ్వడం లేదని చెప్పారు. తహసీ ల్దార్‌ను కలిసి డాక్యుమెంట్లు ప్రైవేట్ వ్యక్తి వద్ద ధరణి ఆపరేటర్ మా మూళ్ల కోసం దాచి పెట్టాడని, ఇప్పించాలని వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్ ధరణి ఆపరేటర్‌ను పిలిపించి డాక్యుమెంట్లను వారికి ఇప్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఇల్లందకుంట, సెప్టెంబరు 19: మండలంలోని సిరిసేడు గ్రామ శివారు లో గురువారం ఓ యువకుడు బైక్ అదుపు తప్పి పడిపోవడంతో తలకు గా యమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం టేకుమట్ల మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన కన్నూరి రమేశ్‌కు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడైన కన్నూరి ప్రభంజన్ (21) గురువారం తన వ్యక్తిగత పని మీద జమ్మికుం టకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామ శివారులో తన బైక్ అదుపు తప్పి కింద పడగా తలకు తీవ్రగా యమై మృతి చెందాడు. ప్రభంజన్ తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

గంభీరావుపేటలో అగ్ని ప్రమాదం

- ఇల్లు, కిరాణషాపు దగ్ధం - భారీగా ఆస్తి నష్టం

గంభీరావుపేట, సెప్టెంబరు 19: గంభీరావుపేట మండల కేంద్రంలోని మేయిన్‌రోడ్‌లో బచ్చు కృష్ణమూర్తి ఇంట్లో, కిరాణ షాపులో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. కృష్ణమూర్తి కుటుంబం మూడు రోజుల కిందట హైదరాబాద్‌లో ఉన్న వారి సమీప బంధువుల వద్దకు వెళ్లారు. ఉన్నట్టుండి గురువారం రాత్రి కృష్ణమూర్తి ఇంట్లో మంటలు చెలరే గాయి. సమీప ప్రజలు మంటలను గుర్తించి, పోలీస్‌లకు, ఇంటి వారికి సమాచారం ఇచ్చారు. ఇంటికి, కిరణా షాపునకు తాళాలు వేసి ఉండటంతో మంటలు ఆర్పడం కొంత కష్టమైంది. దీంతో కిరాణషాపు షెట్టర్లను పగుల గొట్టి లోనికి ప్రవేశించి, స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. మంటలు మరింత చెలరేగడంతో ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. అప్పటికే కిరాణషాపులోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఇంట్లోని ఫ్రిడ్జ్, బీరువా, ఫ్యాన్లు, మంచాలు, కుర్చీలు, విలువైన పరికరాలు మంటల్లో పూర్తిగా కాలిపోయాయి. ఇంట్లో, పక్క ఇంట్లో కూడా గ్యాస్ సిలిండర్లు ఉండటంతో సమీప ప్రజలు భయందోళనలకు గురయ్యారు. సిలిండర్ల వద్దకు మంటలు వ్యాపించకుండా యువకులు సాహసంతో సిలిండర్లను బయటకు తెచ్చారు. ఫైర్ ఇంజన్ వచ్చాక మిగిలిన మంట లను సిబ్బంది ఆర్పారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మంటలను ఆర్పే సహాయక చర్యల్లో పాల్గొన్న యువకులను గ్రామస్తులు అభినందించారు. స్థానిక ఎస్ఐ రాంమోహన్, పలువురు నాయకులు, యువకులు, పోలీస్ సిబ్బంది వచ్చి, మంటలను ఆర్పే వరకు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

సీడ్ ఆర్గనైజర్ నుంచి డబ్బులు ఇప్పించాలి

- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 19: మండలంలోని చెల్పూర్ గ్రామా నికి చెందిన ఇరుమల్ల సురేందర్‌రెడ్డి తనకు సీడ్ ఆర్గనైజర్ దగ్గర నుంచి డబ్బులు ఇప్పించాని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకున్న ఆరు ఎకరాల భూమిలో శ్రీజ కంపెనీకి చెందిన ఆర్గనైజర్ చిన్నపాప య్యపల్లి గ్రామానికి చెందిన గిసిడి కొండల్‌రెడ్డి, మరో ఆర్గనైజర్ సంతోష్ అనే వ్యక్తులు ఎకరానికి లక్ష 20 వేల రూపాయల దిగుబడి వస్తుందని ఆశ చూపి సీడ్ సాగు చేయించారని చెప్పాడు. పంట సాగు చేస్తున్న క్రమంలో పరిశీ లనకు రమ్మని ఎన్నిసార్లు ఫోన్ చేసిన స్పందించలేదని తెలిపాడు. పురుగు ఉధృతిని తగ్గించేందుకు పలుమార్లు మందు స్ప్రే చేయడంతో దిగు బడి తగ్గిందని వాపోయాడు. ఒప్పందం ప్రకారం డబ్బు లు ఇస్తామని చెప్పి ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని చెప్పాడు. తనకు తెలి యకు ండానే తన ఖాతాకు 4 లక్షల 75 వేల నగదును పంపించారని చెప్పాడు. మిగతా 2 లక్షల 45 వేల రూపాయల కోసం ఆర్గనైజర్స్ ఇంటికి వెళ్తే స్పందించడం లేదని తెలిపాడు. తన ఖాతాకు వచ్చిన డబ్బులకు చెక్కు ఇచ్చానని అన్నాడు. గ్రామంలో మరో 50 మం ది రైతులను ఇలానే మోసం చేశారని, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరాడు.

వృద్ధులకు రాష్ట్ర స్థాయి అవార్డులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 19: విశిష్ట సేవలు అందించిన వయో వృద్ధులకు రాష్ట్ర స్థాయి అవార్డులు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీ య వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విశిష్ట సేవలు అందించడంలో నిమగ్నమైన అర్హతల కలిగిన సంస్థలకు, సంస్థల ప్రతినిధులకు రాష్ట్ర స్థాయి అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. ఈనెల 25లోపు హైదరాబాద్‌లోని వికలాంగుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం మలక్‌పేట నందు దరఖాస్తులు సమర్పించాలన్నారు. 9652394751, 040-245590480 నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

23నుంచి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 19: జిల్లా స్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య కబడ్డీ పోటీలను ఈనెల 23,24 తేదిల్లో ప్రభుత్వ ఉన్నత పాఠ శాల హుజూరాబాద్ మైదానంలో నిర్వహించనున్నారని జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. 23న అండర్ 17 బాల బాలికలకు, 24న అండర్ 14 బాలబాలికలకు కబడ్డీ పోటీలను హుజూరాబాద్ మం డల కన్వీనర్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, నిర్వహణ కార్యదర్శి పిడి సొల్లు సారయ్యల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని తెలిపారు. జిల్లా లోని 16 మండలాల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొ న్నారు. ఎంపికైన వివిధ మండలాల క్రీడాకారులు మండల కన్వీనర్ కార్యదర్శుల సంతకంతో కూడిన అర్హత ధ్రువపత్రాలతో నిర్వహకులకు ఉదయం తొమ్మిది గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీ లలో ప్రతిభ కనబరిచిన బాలబాలికలను త్వరలో నిర్వహించే జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. వివరాలకు సొల్లు సార య్య 9391739736 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు



ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు అందిస్తున్న అధికారులు

భగత్‌నగర్, సెప్టెంబరు 19 : కరీంనగర్ రీజియన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం త్రైమాసిక అవార్డులను అధికారులు అందించారు. గురువారం కరీంనగర్‌లోని డాక్టర్ అంబేద్కర్ బస్‌స్టేషన్ సమావేశ మందిరంలో రీజినల్ మేనేజర్ సుచరిత ఆధ్వర్యంలో అవార్డులను అందించారు. వివిధ కేటగిరీలకు చెందిన 28మంది ఉద్యోగులను నగదు పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ రీజియన్‌ను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలుపుటకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్ సత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ సీహెచ్ వెంకటేశ్వర్లు పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, డిపో మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష

జ్యోతినగర్, సెప్టెంబరు 19 : ఆర్‌ఎఫ్‌సీఎల్ సమీపంలో 2023 ఫిబ్రవరి 18న కొయ్యాడ వెంకన్నగౌడ్ అనే వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో గోదావరిఖనికి చెందిన ఎస్.కె.సమీర్(19), సయ్యద్ వాజీద్(25)లకు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 3 వేల రూపాయల జరిమానా విధిస్తూ గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి.శ్రీనివాసులు గురువారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. ఎల్కలపల్లిగేట్ నుంచి ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంటు సమీపంలోని అయ్యప్పగుడి ఎదురుగా ఉన్న కల్లు దుకాణంకు సమీర్, వాజీద్ తరచూ వచ్చి బీర్లు తాగేవారు. అయితే ఇక్కడ మద్యం తాగవద్దని వెంకన్నగౌడ్ ఆ ఇద్దరు వ్యక్తులను వారించాడు. దీంతో కోపం తెచ్చుకున్న సమీర్, వాజీద్‌లు కత్తితో వెంకన్నగౌడ్‌పై దాడి చేసి విచక్షణారహితంగా పొడిచి గాయపరిచారు. బాధితుడి కొడుకు సుధాకర్ ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్‌ఐ జీవన్ ఆ ఇద్దరిపై కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు ట్రయల్‌లో భాగంగా ప్రస్తుత ఎన్టీపీసీ ఎస్‌ఐ సతీష్ సాక్షులను అదనపు పీపీ ఆకుల రాములు ఆధ్వర్యంలో కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి బి.శ్రీనివాసులు ఇద్దరు నిందితులను దోషులుగా తేల్చారు. సమీర్, వాజీద్‌లకు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి 3 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమానా కట్టని పక్షంలో అదనంగా 6 నెలలు జైలుశిక్ష విధించారు. సాక్షులను ప్రవేశపెట్టడంలో సహకరించిన కోర్టు కానిస్టేబుల్ బుర్ర శ్రీనివాస్, హోంగార్డు పూరెల్ల శ్రీనివాస్‌లను రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ సతీష్ అభినందించారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద

జగిత్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీరు స్వల్పంగా వస్తోంది. 4,140 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర ములకు కలిపి ప్రాజెక్టు నుంచి 10,940 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 2,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 6,800 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 550 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, అలీ సాగర్ ఎత్తిపోతల పథకానికి 180 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసె క్కులు విడుదల అవుతుండగా 709 క్యూసె క్కుల నీరు ఆవిరి అవుతోంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్ప టివరకు ప్రాజెక్టులోకి 185.742 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

ఎన్టీపీసీలో వ్యాపారి ఇంట్లో చోరీ

- 9 తులాల బంగారు నగలు, కిలో వెండి, రూ 1.50 లక్షల నగదు అపహరణ



దొంగలు విరగ్గొట్టిన తలుపు గడియ.. చోరీ జరిగిన ఇంట్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

జ్యోతినగర్, సెప్టెంబరు 19 : గోదావరిఖని ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో తులసి హరిప్రసాద్ రావు(అబ్బులు) అనే వ్యాపారి ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి తలుపు గడియను విరగ్గొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు ఇంట్లో ఉన్న తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, కిలోవెండి, 1,50,000 రూపాయల నగదు, 25 ఖరీదైన చీరలను అపహరించారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 16న అనారోగ్యంతో ఉన్న బంధువులను చూసేందుకు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో హరిప్రసాద్‌రావు సూర్యా పేటకు వెళ్లాడు. గురువారం తిరిగి ఇంటికి వచ్చిన హరిప్రసాద్‌రావు చోరీ జరిగిన విషయం గుర్తించి ఎన్టీ పీసీ పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న ఎన్టీపీసీ ఎస్‌ఐ సతీస్, పోలీసులు, సీసీఎస్ పోలీసులు దేవేందర్‌గౌడ్ (హెచ్‌సీ), రాజమౌళి (పీసీ)లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కమిషనరేట్‌కు చెందిన డాగ్ స్క్వాడ్‌తో పరిసరాలను తనిఖీ చేశారు. ఫింగర్ ప్రింట్ బృందం చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరించింది. అర్ధరాత్రి సమయంలో చోరీ జరిగినట్లు తెలుస్తున్నది. బీరువా డోర్‌ను పగులగొట్టి అందులో ఉన్న నగలు, నగదు, చీరలను ఎత్తుకెళ్లినట్లు తెలు స్తున్నది. ఇంటి యజమాని హరిప్రసాద్ కుందనపల్లిలో పెట్రోల్‌బంక్ నడుపుతు నాడు. కృష్ణానగర్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమా చారం. ఎన్టీపీసీ, సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఎస్సారెస్పీ కెనాల్‌కు పడిన గండి (ఫైల్)

పరిహారం.. పరిహాసం

- 2016లో ఎస్సారెస్పీ కెనాల్‌కు గండి
- నీట మునిగిన వందలాది ఎకరాల్లోని పంటలు
- పరిహారం కోసం ఎదురుచూస్తున్న రైతులు

మల్యాల, సెప్టెంబరు 19 : ఎస్సారెస్పీ కెనాల్ తెగి కాలువ నీరు పంటలను ముంచెత్తింది. పొలాల్లో ఇసుక మేటలు వేసింది.. ఇళ్లన్నీ జలమయం అయ్యాయి.. మంత్రులు, అధికారులు, ఆఖరికి కేంద్రం నుంచి బృందం కూడా వచ్చి అయ్యో పాపం అంది.. పరిహారం ఇస్తాం.. ఆదుకుంటాం అన్నారు. ఇదంతా ఎనిమిదేళ్ల క్రితం మాట... అయినా ఇప్పటికీ పరిహారం జాడలేదు. వివరాల లోకి వెళ్తే.. మల్యాల మండలం మానాల శివారులో గల ఎస్సారెస్పీ కాకతీయ కాలువ డి-65 వద్ద 2016 సెప్టెంబరు 20న గండి పడి సమీప దమ్మక్క చెరువు, మ్యాడంపెల్లిలోని చెరువులు నిండి పంట పొలాలను ముంచెత్తాయి. మ్యాడంపెల్లిలో ఇళ్ల నుంచి వరద వెళ్లగా ఇళ్లన్నీ జలమయం అయ్యాయి. బాధితులు రెండు రోజుల పాటు ఇళ్లు ఖాళీ చేశారు. వందకు పైగా ఇళ్లకు నష్టం జరిగితే 28 ఇళ్లకు మాత్రమే నష్టం జరిగిందని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఇక వందలాది ఎకరాల పంటలకు నష్టం వాటిల్లగా పంట భూముల్లో ఇసుక మేటలు వేసింది. అప్పటి రాష్ట్రమంత్రులు ఈటల రాజేందర్, హరీష్‌రావులు వచ్చి రైతులను ఓదా ర్చారు. ఆదుకుంటామన్నారు. అనంతరం 2016 నవంబర్ 13న కేంద్ర బృందం కూడా వచ్చి రైతుల నుంచి నష్టం వివరాలు తెలుసుకున్నారు.

● నష్టం వివరాలు ఇవి

ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్‌కు గండి పడటంతో నష్టం వాటిల్లిన పంటలపై రెవెన్యూ వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదిక రూపొందించి పంపించారు. మానాల గ్రామ పరిధిలో 16 మందికి చెందిన 274 హెక్టార్లలో వరి, 0.40 హెక్టార్లలో ముగ్గురు రైతులకు చెందిన మొక్కజొన్న, 30 మందికి చెందిన 7.49 హెక్టార్ల పంట భూముల్లో ఇసుక మేటలు వేసింది. మ్యాడంపెల్లి పరిధిలో 40 మందికి చెందిన 7.23 హెక్టార్లలో వరి, నలుగురికి చెందిన 0.48 హెక్టార్లలో మొక్కజొన్న, ఒక్క రైతు 0.27 హెక్టార్ల పత్తి, ఏడుగురు రైతుల 2.24 హెక్టార్లలో కంది, 69 మంది రైతుల 14.06 హెక్టార్ల భూముల్లో ఇసుక మేటలు వేసిందని అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు.

● కేంద్రం పరిహారం అందించకపోవడానికి కారణం అదేనా?

కేంద్ర ప్రభుత్వ బృందం పర్యటించిన ప్రతి చోట పరిహారం రావడం తప్పనిసరి. కానీ ఇక్కడ మాత్రం రాకపోవడానికి అనేక కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. మానాల శివారులో కెనాల్ తెగకముందే రెండేళ్ల క్రితం గండి పడి సిమెంట్ సంచులతో తాత్కలిక మరమ్మతులు చేశారని కేంద్రబృందం దృష్టికి వెళ్లిన్నట్లు తెలిసింది. దీంతో ఇది మానవ తప్పిదంగా పరిగణించే కేంద్రం పరిహారం ఇవ్వలేదనే చర్చ జరుగుతోంది. ప్రకృతి విపత్తులకు అందించే పరిహారం అప్పటి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంగా తెగిన కాలువకు అందించలేమని చెప్పిన్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

పంటలు మొత్తం నీట మునిగాయి



కెనాల్ కాలువ తెగడంతో తమ భూముల నుంచి నీరు ప్రవహించి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. తమ మామిడి తోటతో పాటు అయిదు ఎకరాల కంది పంటలు నీటిలో మునిగిపోయాయి. అధికారులు వచ్చి పలుమార్లు సర్వే చేశారు. నివేదికలు తయారు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసు కెళ్లినా దీనిపై పట్టించుకునే వారే లేరు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం పరి హారం అందించాలి.

\- రాజేందర్, రైతు, మ్యాడంపల్లి

సాగుకు రెండేళ్లు పట్టింది



తనకున్న భూమితో పాటు మరో ఎకరం కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేసాను. కాలువకు గండి పడి నీరంతా తమ పొలం నుంచే వెళ్లింది. ఇసుక మేటలు వేసింది. గండ్లు పడి వ్యవసాయం చేసుకునే విధంగా లేకుండా పోయింది. దీంతో రెండేళ్లు చదును చేయడానికే పట్టింది. అప్పుడు పంట నీటిలో కొట్టుకు పోయి నష్టం జరుగగా చదును చేయడం, రెండేళ్ల పాటు పంట వేయక పోవడంతో మరింత అప్పులు చేయాల్సి వచ్చింది.

\- రాజయ్య, రైతు, మానాల

దుబాయిలో గంభీరావుపేట వాసి మృతి

- వెళ్లిన కొద్ది రోజులకే విషాదం
- కన్నీరు మున్నీరవుతున్న భార్యాపిల్లలు
- మృతదేహాన్ని త్వరగా తెప్పించాలని వేడుకోలు

గంభీరావుపేట, సెప్టెంబరు 19: బతుకుదెరువు కోసం గల్ఫ్ బాట పట్టిన ఓ వ్యక్తి వెళ్లిన కొద్ది రోజులకే ఫిట్స్‌తో మృతి చెందిన ఘటన ఆ కుటుంబాన్ని కలిచివేస్తోంది. గంభీరావుపేటకు చెందిన కరువారి దేవయ్య (46) అనే వ్యక్తి గత నెల 19న లక్షా రూపాయల వరకు అప్పుచేసి ఓ కంపెనీ వీసాపై దుబాయి వెళ్లాడు. వెళ్లిన రెండు రోజుల్లో దేవయ్య పనిలో చేరాడు. పనిలో చేరిన మరుసటి రోజే దేవయ్య తన రూంలో ఉండగా ఫిట్స్ వచ్చింది. దీంతో దేవయ్యను ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గత నెల 27న మృతి చెందాడు. గల్ఫ్‌లో దేవయ్య మృతి చెంది దాదాపు 22 రోజులు గడిచి పోయాయి. దేవయ్య ఫిట్స్‌తో ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం కుటుంబీకులకు ఆలస్యంగా తెలిసింది. దేవయ్య నుంచి ఫోన్ రాకపోవడం, ఇక్కడి నుంచి ఫోన్ కలవకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. దుబాయిలో తెలిసిన వారి నుంచి దేవయ్య మృతి చెందాడని ఫోన్ రావడంతో భార్యాపిల్లలు రోదనలు మిన్నంటాయి. మృతి చెంది 22 రోజులు గడిచినా ఇంటికి దేవయ్య మృతదేహం రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. దేవయ్య మృతదేహాన్ని అక్కడి ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారాని సమాచారం అందింది. కంపెనీ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో దేవయ్య మృతదేహం స్వదేశానికి రావడం ఆలస్యం అవుతోందని మృతుడి బంధువులు తెలిపారు. దుబాయిలో కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి తన భర్త దేవయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా తెప్పించేలా ప్రభుత్వం కృషి చేయాలని భార్య శ్యామల వేడుకుంటున్నారు.



దేవయ్య(ఫైల్)




దేవయ్య మృతదేహాన్ని తెప్పించాలని వేడుకుంటున్న దేవయ్య భార్యాపిల్లలు

ప్రపంచ దేశాల్లో శాస్త్రవేత్తలుగా రాణిస్తున్నది భారతీయులే

- తహసీల్దార్ కిషన్

కోరుట్ల, సెప్టెంబరు 19 : ప్రపంచ దేశాలలో భారతీయులు శాస్త్రవేత్తలుగా రాణిస్తున్నారని తహసీల్దార్ కిషన్ అన్నారు. పట్టణంలోని శిశు మందిర్‌లో సిద్దిపేట, జగిత్యాల, కరీంనగర్, రాజ న్న సిరిసిల్ల విభాగ్‌స్థాయి గణిత విజ్ఞాన మేళాను ఆర్‌ఎస్‌ఎస్ గ్రామీణ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు జిన్నా సత్యనారాయణతో కలిసి తహసీల్దార్ కిషన్ ప్రారంభించారు. గణత విజ్ఞాన మేళా కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థుల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించిన సరస్వతి శిశుమందిర్‌ల నిర్వాహకులు గణతంలో వివిధ మెలకువలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా తహ సీల్దార్ కిషన్, ఆర్‌ఎస్‌ఎస్ గ్రామీణ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు జిన్న సత్యనారాయణ మాట్లాడారు. విద్యార్థులు గణితంలో శ్రద్ధ వహించి చదువుతే ఉన్నత ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. విద్యార్థులకు శిశుమందిర్ విద్యా ఎంతో క్రమశిక్షణను నేర్పుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగుల నరేశం, డాక్టర్ రవికిరణ్, పాఠశాల కరస్పా డెంట్ నీలి శ్రీనివాస్, డైరెక్టర్ల మనోజు కుమార్, శివప్రసాద్, చంద్రమోహన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వక్తలు

ముచ్చటిస్తూ.. సమస్యలను తెలుసుకుంటూ..

- ఏకలవ్య గురుకుల పాఠశాలను సందర్శించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 19 : మండలంలోని దుమాల ఏకలవ్య గురుకుల పాఠశాలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ సమస్యలను తెలుసుకున్నారు. దుమాలలో దాదాపు మూడు గంటలపాటు పర్యటించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, విద్యార్థుల సంఖ్య, బోధన విధానం తదితర అంశాలపై ఆరా తీశారు. తరగతి గదుల్లోకి నేరుగా వెళ్లి పిల్లలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన చిత్రలేఖనం గదిని ప్రారంభించారు. విద్యార్థులు గీసిన చిత్రాలను తిలకించారు. సాధించిన అవార్డులను విద్యార్థులు, ఉపాధ్యాయులు వివరించారు. సంగీతం గదికి వెళ్లారు. విద్యార్థులు కింద కూర్చొని ఉండడంతో ఆయన వారితో పాటే కింద కూర్చొని సంగీతం విన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినిని ఉపాధ్యాయులు పరిచయం చేయడంతో మంత్రి సంజయ్‌కుమార్ మొదటి పల్లవి పాడాలని కోరారు. దాంతో విద్యార్థిని 'పలుకె బంగారమాయేనా.. కోదండ పాణి' అంటూ పాడడంతో మంత్రి సంజయ్‌కుమార్ లీనమయ్యారు. విద్యార్థినిని అభినందించి మనమంతా ఇలాంటి పాటలే పాడాలని సూచించారు. అనంతరం మంత్రి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏకలవ్య ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసిందని తెలిపారు. గిరిజన, ఆదివాసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆశించిన ఫలితాలు క్షేత్రస్థాయిలో అమలు అవుతున్నాయో..? లేదో పరిశీలించాలనే పీఎం నరేంద్రమోదీ ఆదేశాల మేరకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని మరిమడ్ల, దుమాలలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాలలను సందర్శించామని వెల్లడించారు. అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ద్వారా సమస్యలను గుర్తించామని పేర్కొన్నారు. నివేదికను ప్రభుత్వానికి సమర్పించి మెరుగైన విద్య అందించేందుకు పాటు పడుతామని అన్నారు.

● పిల్లలూ పెద్దయ్యాక ఏమవుతారు..?

దుమాల ఏకలవ్య ఆదర్శ పాఠశాల తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో బండి సంజయ్ మాట్లాడారు. ఏం తల్లీ నీ పేరేమీటి..? అంటూ ప్రశ్నించారు. బాగున్నారా..? నేనెవరినో గుర్తు పట్టారా..? ఎలా చదువుతున్నారని కుశల ప్రశ్నలు వేశారు. సార్ మేం బాగున్నాం.. మీరేలా ఉన్నారూ.. అని పేర్కొన్నారు. సారూ.. మీరు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ కదా..! అని చెప్పడంతో గుర్తున్నానులే అంటూ సమాధానమిచ్చారు. పిల్లలు పెద్దయ్యాక మీరేం అవుతారని ప్రశ్నించడంతో ఓ విద్యార్థిని ఐపీఎస్, మరో విద్యార్థిని ఐఏఎస్ అని పేర్కొనడంతో మంత్రి సంజయ్‌కుమార్ శభాష్ అంటూ అభినందించారు. ఆ దిశగా మీరు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి పీఎం నరేంద్రమోదీ ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి ఆధునిక విద్యను అందిస్తోందని మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేశ్, ఏకలవ్య పాఠశాలల ఆర్‌సీవో జానునాయక్, డీఈవో రమేశ్ కుమార్, ప్రత్యేక అధికారులు భారతి, రాందాస్, ప్రిన్సిపాల్ మంజిద్ తదితరులు పాల్గొన్నారు.



దుమాలలో కేంద్ర మంత్రి సంజయ్‌కుమార్‌కు చిత్ర పటాన్ని అందజేస్తున్న విద్యార్థినులు

● కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల గ్రామంలో గల ఏకలవ్య గురుకుల పాఠశాలను బండి సంజయ్ సందర్శించారు. ఈ సందర్భంగారాగా అధికారులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రికి విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో స్వాగతం పలికారు. అనంతరం గురుకుల పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మనోభావాలు ఎలా ఉన్నాయి? ఎవరు స్పోర్ట్స్‌పై దృష్టిపెట్టారు. చదువులో ఎలా దృష్టి పెట్టారు అనే అంశంపై ఒక్కొక్క విద్యార్థిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులను పాఠశాలల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టాయిలెట్ల నిర్మాణం కోసం మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, డీఈవో రమేష్, ప్రత్యేక అధికారులు లక్ష్మీరాజం, భారతి, రాందాస్, ఆర్డీవోలు రాజేశ్వర్, రమేష్, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ప్రిన్సిపాల్ ఆర్‌ఎస్‌యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ నేత చెన్నమనేని వికాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి

మల్లాపూర్, సెప్టెంబరు, 19 : మండలంలోని కుస్తాపూర్ శివారులో మక్క తోట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెతో జెల్ల పెద్ద ముత్తన్న(60)అనే రైతు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గొండ సాయన్న అనే రైతు తన మక్కచేను రక్షణ విద్యుత్‌తో కంచె ఏర్పాటు చేసుకోవడంతోనే పెద్ద ముత్తన్న మృతి చెందినట్లు అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొండ సాయన్నపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. జెల్ల పెద్దముత్తన్న ఎరువులు చల్లేందుకు తన పొలం వెళ్లాడు. రాత్రి అయినప్పటికీ తిరిగి ఇంటికి రాకపోగా కుటుంబ సభ్యులు అతని కోసం వెతికారు. కాగా గొండ సాయన్న తన మక్క చేను రక్షణకు అమర్చుకున్న ఇనుప కంచె వద్ద పెద్దముత్తన్న విగత జీవిగా పడి ఉన్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించినట్లు తెలిపారు. విద్యుదాఘాతంతో శరీరం కమిలిపోయి ఉన్నట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శవపంచనామా జరిపి పోస్టుమార్టంకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

భూ వివాదాలతో వ్యక్తి దారుణ హత్య

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 19 : భూ వివాదాల విషయమై ఓ వ్యక్తి హత్యకు గురైన సంఘటన పెద్దపల్లి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రైల్వే రిటైర్డ్ కార్మికుడు కలవేన రాజయ్య(68)కు, అతడి బంధువులకు మధ్య కొంతకాలంగా భూముల విషయంలో తగాదాలు జరుగుతున్నాయి. గురువారం రోజూమాదిరిగా రాజేశం ఇంటి నుంచి పొలం వద్దకు వెళుతుండగా కొత్తపల్లి-కొలనూర్ గ్రామ శివారులో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి హతమార్చారు. సంఘటన స్థలాన్ని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్ పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడు మాజీ ఎంపీటీసీ సాయి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

ఒకరి గల్లంతు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 19 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువులో గురువారం ఒకరు గల్లంతయ్యారు. సుమారు 24 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి చెరువులోకి ఈత కోసం వెళ్లి బయటకు రాకపోవడాన్ని స్థానికులు గమనించి డయల్ 100కు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి పట్టణ పోలీసులు చేరుకుని జాలర్లతో గాలింపు చేపట్టారు. రాత్రి కావడంతో ఆచూకీ లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మంథనిరూరల్, సెప్టెంబరు 19: మండలంలోని నాగారం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 48.8 క్వింటాళ్ల రేషన్ బియాన్ని పట్టుకున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేందర్ గురువారం తెలిపారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు చేయగా మినీ డీసీఎం వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 48.8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి, వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్ అప్పగించినట్లు తెలిపారు. వ్యాన్‌యాజమాని, డ్రైవర్, ఇతర కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న విలువ 2.78 లక్షల విలువ ఉంటుందన్నారు.

సైదాపూర్, సెప్టెంబరు 19: సైదాపూర్ మండలంలోని ఎలబోతారం గ్రామంలో అక్రమంగా నిలువ ఉంచిన ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. సమాచారం ప్రకారం ఎలబోతారంలో తనిఖీ చేయగా ఓ ఇంటిలో అక్రమంగా నిలువ ఉంచిన ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం నిలువ ఉంచిన బత్తు భిక్షపతి, బత్తుల రాజయ్య స్వామిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

బాలుడికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 19 : మండల కేంద్రానికి చెందిన వైభవ్ అనే బాలుడు కుక్కల దాడిలో గురువారం తీవ్ర గాయాలపాలయ్యాడు. బాలుడిని తల్లిదండ్రులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైభవ్ ఇంటి ఎదుట ఆడుకుంటున్న క్రమంలో కుక్కలు దాడి చేశాయి. అక్కడే ఉన్న బాలుడి తల్లిదండ్రులు కుక్కలను తరమడంతో అవి అక్కడ నుంచి పారిపోయాయి. గ్రామంలో ఇటీవల కుక్కల బెడద అధికమైందని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

చందుర్తి. సెప్టెంబర్ 19 : చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చందుర్తి మండల కేంద్రానికి చెందిన యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. చందుర్తికి చెందిన చేట్టిపెల్లి రవి అనే యువకుడు గురువారం తన ద్విచక్ర వాహనంపై వేములవాడ నుంచి చందుర్తికి వస్తున్నాడు. కోరుట్ల నుంచి వేములవాడకు వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఎదురెదురుగా మర్రిగడ్డలో ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రవి ఎడమ కాలుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడ ఆసుపత్రికి తతరలించారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టినట్లు ఏఎస్సై బాపు తెలిపారు.

ముగ్గురిపై అదనపు వరకట్నం కేసు

జమ్మికుంట, సెప్టెంబరు 19 : అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు. జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్ గ్రామానికి చెందిన ఎండి సమీనాకు, అదే గ్రామానికి చెందిన సమీర్‌కు పది నెలల క్రితం వివాహం జరిగింది. నెల రోజుల పాటు వారి కాపురం సజావుగా సాగింది. అనంతరం అదనపు కట్నం కావాలంటూ భర్త వేధిస్తున్నాడు. దీంతో తల్లిగారి ఇంటికి వచ్చిన సమీనా పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త సమీర్, మామ గఫార్, అత్త కమర్‌లు అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 19 : పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా పోగొట్టుకున్న 25మంది బాధితుల మొబైల్ ఫోన్లను కరీంనగర్ సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ పోలీసులు సీఈఐఆర్ విధానం ద్వారా పట్టుకుని గురువారం బాధితులకు సీఐ రమేష్ చేతుల మీదుగా అప్పగించారు. 1,035మంది మొబైల్ ఫోన్‌లను గుర్తించి బాధ్యులకు అప్పగించామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ సీఐ రమేష్, ఎస్‌ఐ నాగరాజు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై వ్యాఖ్యలు అభ్యంతరకరం

- బీజేపీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 19: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని నాయకులు గురువారం బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ నేతలకు వ్యతిరేకంగా నినదించారు. రాహుల్‌గాంధీ బయటకు వస్తే చంపేస్తామంటూ బీజేపీ నేత తన్వీందర్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, సాహెబ్, బుచ్చాగౌడ్, రాంరెడ్డి, బాబు, శ్రీనివాస్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీలో ఉచిత శిక్షణ

సిరిసిల్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, కేంద్ర ప్రభుత్వం, సాలార్‌జంగ్ మ్యూజియం, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో ఈనె 23న హైదరాబాద్ రవీంద్రభారతిలో ఉచిత ఫొటోగ్రఫీ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని సిగ్మా అకాడమీ చైర్మన్ ఎంసీ శేఖర్ గురువారం సిరిసిల్లలో తెలిపారు. ఆసక్తిగల ఫొటోగ్రాఫర్లు ఫొటోగ్రఫీ అభిరుచి ఉన్నవాళ్లు శ్యాప్ ఇండియా వెబ్‌సైట్ లేదా 8008021075 ద్వారా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. పిక్టోరియల్ షూటింగ్, కంపోజిషన్, లైటింగ్, ఫొటోగ్రఫీ పరిజ్ఞానంపై ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.

పందులను నియంత్రించాలి

ముస్తాబాద్, సెప్టెంబర్ 19: మండల కేంద్రంలో పందుల బెడద ఎక్కువైందని వాటిని నియంత్రించాలని బీసీ సంఘం యూత్ రాష్ట్ర నాయకుడు శీలం స్వామి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, బద్ధ శ్రీనివాస్ ఈవో రమేశ్‌కు వినతి పత్రాన్ని అందించారు. ముస్తాబాద్‌లో పూర్తిగా నివారణ జరిగిందని మళ్లీ గ్రామంలో విచ్చలవిడిగా తిరుతుగున్నాయన్నారు. గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. వెంటనే పందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

క్రీడాపోటీలు ప్రారంభం



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 19: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం క్రీడాపోటీలను ప్రారంభించారు. అండర్-14, 17 విభాగాల్లో బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. పోటాపోటీగా జట్లు తలపడ్డాయి. విజేతలకు స్థానికుడు జంగ అంజిరెడ్డి రూ.12 వేల విలువైన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను తెరిపించాలని నిరసన

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 19: స్వచ్ఛ భారత్ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటు చేసిన టైటిల్ మరుగుదొడ్లను వెంటనే తెరిపించాలని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నాయకులు నిరసనలు తెలిపారు. మున్సిపల్ ఆధ్వర్యంలో టైటిల్ మరుగుదొడ్లను సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి నాయకులు సందర్శించారు. టైటిల్ మరుగుదొడ్ల నిర్వహణ మూలనపడిందని తాళాలు వేసి నిరుపయోగంగా ఉంటున్నాయని వాటిని తెరపించి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. జిల్లా కేంద్రానికి వచ్చి వెళ్లే ప్రజలకు సౌకర్యాన్ని కల్పించాలని పౌర సంక్షేమ సమితి నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకుపోయినా స్పందన లేదని ఆరోపించారు. కలెక్టర్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లా పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, కార్యదర్శి కుసుమ గణేష్, కోశాధికారి చిప్ప దేవదాస్, సత్యసాయి సేవ సమితి అధ్యక్షుడు చీకోటి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 19: ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంతోపాటు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం నాయకులతో కలిసి కంచర్ల రవిగౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన క్రీడా స్థలాలతోపాటు తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు తెలిపిన సమస్యలను విద్యాధికారుల దృష్టికి తీసువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మట్టే శ్రీనివాస్, కోడం వెంకటేష్, నరేస్, భాను, సాయి, తిరుపతి, శ్రీనివాస్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 19: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలంటూ గురువారం ఉపాధ్యాయులు సంతకాలను సేకరించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలంటూ సంతకాలు సేకరించి నిరసనలు వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకువస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాత పెన్షన్ సాధన సమితి ప్రధాన బాధ్యులు గుండెల్లి రవీందర్, బుర్ర కృష్ణప్రసాద్, రెడ్డి రవి, మిట్టపల్లి లక్ష్మీనారాయణ, సలావుద్దీన్, రాజలింగం, అనంద్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించాలి

- అభ్యంతరాలు ఉంటే 21లోగా తెలియజేయాలి - వివిధ పార్టీ నాయకులతో ఎంపీడీవోల సమావేశం





ఇల్లంతకుంట, రుద్రంగిలో వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీవోలు శశికళ, నటరాజ్

ఇల్లంతకుంట, సెప్టెంబరు 19: గ్రామపంచాయతీ ఎన్నికల కోసం ప్రదర్శించిన ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించాలని ఎంపీడీవో శశికళ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అన్ని పార్టీల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతు గ్రామపంచాయతీ కార్యాలయ నోటీసు బోర్డుల్లో ముసాయిదా జాబితాను ప్రదర్శించామని, ఏమైన అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21లోపు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఒక కుటుంబంలోని వ్యక్తులందరిని ఒకే దగ్గర ఉండేలా చూడటం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు దేశెట్టి శ్రీనివాస్, తడకపెల్లి భూమయ్య, మంద అనీల్‌కుమార్, తిరుపతిరెడ్డి, ఎల్లోజి, పైస మోజెస్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: మండలంలోని గ్రామపంచాయతీల్లో ముసాయిదా ఓటర్ల జాబితాపై మండల పరిషత్ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీ నాయకులతో గురువారం ఎంపీడీవో శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. ఇప్పటికే అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితాను నోటీసు బోర్డుపై పెట్టామన్నారు. నూతన ఓటర్లు, చనిపోయిన వారిని గుర్తించి వారి ఓట్లను తొలగించేందుకు ఓటర్ల జాబితాను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. కార్యక్రమంలో పలు పార్టీల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

రుద్రంగి: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు ఉంటే చెప్పాలని ఎంపీడీవో నటరాజ్ సూచించారు. రుద్రంగి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రుద్రంగి మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కార్యలయంలోని నోటీసు బోర్డుపై ఓటర్ లిస్టు ఏర్పాటు చేశామని తెలిపారు. ఏమైన అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సుధాకర్, నాయకులు ఎర్రం గంగన ర్సయ్య, తర్రె మనోహర్, నంద్యాడపు వెంకటేష్, దేగవాత్ తిరుపతి, చేప్యాల గణేష్, అనిల్, గుగ్గిళ్ల వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: ఓటర్ జాబితాలో తప్పులు ఉంటే సవరిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో నటరాజ్ తెలిపారు. చందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఓటర్ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే సవరిస్తామని తెలిపారు. సమావేశంలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చిర్రం తిరుపతి, బత్తుల కమలాకర్ పాల్గొన్నారు.

పాఠశాలలో శ్రమదానం



శ్రమదానం చేస్తున్న ఉపాధ్యాయులు

చందుర్తి, సెప్టెంబరు 19: చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛత పక్షోత్సవాలలో భాగంగా గురువారం శ్రమదానంతో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వచ్ఛదనం, పచ్చదనం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు వేముల సుజాత, ఉపాధ్యాయులు గుర్రం బాలకిషన్, కొత్తూరు శ్రీధర్, రాకం రవి, కాపిల్ల నరేష్, మమత, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు

గర్భిణులకు రక్తపరీక్షలు

వేములవాడ రూరల్, సెప్టెంబరు 19: పోషణ్ అభియాన్‌లో బాగంగా లింగంపల్లిలో గర్భిణులకు, బాలింతలకు, బాలికలకు గురువారం రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత రాకుండా ఎలాంటి ఆహారం తీసుకోవాలో మహిళలకు వివరించారు. అనంతరం పోషక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వాణిశ్రీ, ఏఎన్‌ఎం సరస్వతి, పంచాయతీ కార్యదర్శి దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

సెస్ ఏఈకి సన్మానం

రుద్రంగి, సెప్టెంబరు 19: రుద్రంగి మండలానికి కొత్తగా సెస్ ఏఈగా కుమారస్వామి గురువారం బాధ్యతలు చేపట్టగా సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం శాలువతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో సిరిసిల్ల పట్టణంలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన కుమారస్వామి పదోన్నతిపై రుద్రంగి మండలానికి ఏఈగా బదిలీపై వచ్చారు. కార్యక్రమంలో బండారి నర్సయ్య, సెస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ముస్తాబాద్, సెప్టెంబరు 19: సహచరుడి కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు దేశాయి బీడీ టేకేదారుల సంఘం నాయకులు. ముస్తాబాద్ మండల కేంద్రంలో దేశాయి బీడీ టేకేదారుగా పని చేస్తున్న షర్ఫోద్దీన్ కొంత కాలంగా అనారోగ్యానికి గురై ఇటీవల మరణించాడు.

అతని మరణంపై విచారం వ్యక్తం చేసి బాధిత కుటుంబాన్ని గురువారం ఓదార్చారు. టేకేదారుల సంఘం మండల అధ్యక్షుడు బద్దెపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 15 వేల రూపాయల ఆర్థికసాయా న్ని కుటుంబసభ్యులు బిపాషా, షాదుల్‌పాషాకు అందిం చారు. కార్యక్రమంలో తిరునగారి రంగయ్య, చిట్టబోయిన కిషన్, తుమ్మ శ్రీనివాస్, బల్ల రవి, మాదాసు యాదగిరి, మర్పడగా శంకర్, అంకం శ్రీనివాస్, యాడారపు రాజు, కడారి వెంకటేశ్ ఉన్నారు.

ఎమ్మెల్యేను దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు

కొడిమ్యాల, సెప్టెంబరు 19: చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యంను బుధవారం రాత్రి దూషించిన కొడిమ్యాల గ్రామానికి చెందిన రాచకొండ చంద్రమోహన్‌పై మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరి నారాయణగౌడ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేని వ్యక్తిగత గొడవల్లో అనుచిత వ్యాఖ్యలు చేసి, కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు చంద్రమోహన్ తెలిపాడు. ఈ విషయమై హెడ్ కానిస్టేబుల్ అర్షరాజును వివరణ కోరగా ఫిర్యాదు వచ్చింది వాస్తవమే అన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య - జిల్లాలో బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్





ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో తోట ఆగయ్య, తంగళ్లపల్లిలో నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ముస్తాబాద్, సెప్టెంబర్ 19: అక్రమ అరెస్టులతో రైతాంగ సమస్యల పరిష్కారానికి చేపడుతున్న ఉద్యమాన్ని ఆపలేరని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, కేటీఆర్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, యూత్ అధ్యక్షుడు శీలం స్వామిని ఎస్సై గణేశ్ గురువారం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణా రైతాంగానికి అండగా నిలువాలని రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఛలో ప్రజాభవన్ కార్యక్రమానికి వెళ్లకుండా అరెస్ట్ చేసి పోలీసు ఠాణాకు తరలించారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి పోరాడుతుంటే అరెస్ట్ చేయడం దారుణమని జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. పోలీసు ఠాణాకు వచ్చి వారితో మిలాఖత్ అయ్యారు.

వేములవాడ: వేములవాడ పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. రైతు రుణమాఫీపై చలో హైదరాబాద్ కార్యక్రమం నేపథ్యంలో ముందస్తుగా నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ తరలించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతికుమార్, కౌన్సిలర్ సిరిగిరి రామచందర్, నాయకుడు వెంగళ శ్రీకాంత్ గౌడ్ తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట పోలీస్‌లు బీఆర్ఎస్ నేతలను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. రెండు లక్షల రుణమాఫీ పూర్తిగా జరగలేదని హైదరాబాద్ ప్రజాభవన్ ముట్టడికి మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్ వెళ్లకుండా పోలీస్‌లు ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి మాట్లాడుతూ అక్రమ అరెస్టులు తమ ఉద్యమాన్ని ఆపలేవని అన్నారు. అదుపులోకి తీసుకున్న వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామితో పాటు మాజీ ఎంపీటీసీ ఎగదండి స్వామి, సోషల్ మీడియా నాయకులు సందీప్ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: రైతు సమస్యపై బీఆర్ఎస్ తలపెట్టిన ప్రజా భవన్ ముట్టడి నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట పోలీసులు గురువారం అప్రమత్తయ్యారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నాయకులు మల్లారెడ్డి, కృష్ణహరి తదితరులు ఉన్నారు.

రుద్రంగి: ముందస్తుగా అక్రమంగా అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నామని సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దెగవాత్ తిరుపతి అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ నాయకులను ఉదయం రుద్రంగి పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయన వారిలో బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమాలాకర్, నాయకులు మాడిశెట్టి ఆనందం, చేప్యాల గణేష్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: ప్రజాభవన్ ముట్టడి నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలను పోలీసులు గురువారం ఉదయం ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు బైరగోని రమేష్, బత్తుల కమలాకర్, అబ్రహం రమేష్ రావు ఉన్నారు.

తంగళ్లపల్లి: ప్రజాభవన్ ముట్టడికి వెళుతున్న తంగళ్లపల్లి మండలంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. రైతుల మండల బిఆర్ఎస్ నాయకులు గజభీంకర్ రాజన్న, కోడి అంతయ్య, మాట్ల మధు, అబ్బాడి అనిల్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

వీర్నపల్లి: ప్రజాసమస్యలతో పోరాడుతున్నవారిని అక్రమ అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో రాజిరెడ్డితో పాటు బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేష్‌నాయక్‌ను ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులతో ఉద్యమాలను అపలేరని వారు పేర్కొన్నారు.

కార్మిక వెల్ఫేర్ బోర్డును ప్రైవేటీకరణ కాకుండా చూడాలి

- చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలిరావాలి



సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 19: కార్మిక వెల్ఫేర్ సంక్షేమ బోర్డును ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకునేందుకు కార్మికులంతా ఐక్యంగా ముందుకురావాలని, ఈ నెల 23న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి కార్మికులు తరలిరావాలని తెలంగాణ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి రాజమల్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం తెలంగాణ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసేందుకు నాయకులు తరలివెళ్లారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టరేట్ ఏవో రాంరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డులో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను టెండర్ ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలని ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని నిధులను దుర్వినియోగం కాకుండా కార్మికుల సంక్షేమ కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 25లక్షల మంది పైగా భవన నిర్మాణ ఇతర నిర్మాణ కార్మికులు పనిచేస్తున్నారని వీరంతా సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన అట్టడుగు వర్గాలకు చెందిన పేదలన్నారు.

రాష్ట్రంలో 2007 సంవత్సరంలో కార్మిక వెల్ఫేర్ బోర్డును ప్రకటించి 2009లో నుంచి భవన నిర్మాణ కార్మికులకు 11 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ సంక్షేమ పథకాలు కార్మికుల కుటుంబాలకు అండగా ఉన్నాయని అన్నారు. కేంద్ర చట్టంలో ఉన్న పెన్షన్, పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, గృహవసతి, అడ్డాలలో మౌలిక సౌకర్యాలు వంటి సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు కావడంలేదన్నారు. రాష్ట్రంలో వెల్ఫేర్ బోర్డును ఏర్పాటుచేసిన వాటి పథకాలే నేటికి కొనసాగుతున్నాయన్నారు. కొత్త సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్మికులకు కొత్త సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతుందని ఆశించిన కార్మికులకు నిరాశపర్చిందన్నారు. ప్రస్తుతం ఉన్న సంక్షేమ పథకాలను కార్మికులకు అందకుండా ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చే బాధ్యత నుంచి తప్పుకోవాలని చూస్తోందన్నారు.

రాష్ట్రంలో 25లక్షల మంది కార్మికులు ఉంటే కేవలం 15లక్షల మంది కార్మికులకు మాత్రమే ఇన్సూరెన్స్ రెన్యూవల్ చేసి మిగితా 10లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తించకుండా వారికి అన్యాయం చేస్తోందన్నారు. ఈ నెల 23నచేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి కార్మికులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి గురజాల శ్రీధర్, గీస బిక్షపతి, ఈసంపల్లి రాజయ్య, సావనపెల్లి ప్రభాకర్, ఇల్లందుల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో యువ టూరిజం క్లబ్బుల ఏర్పాటు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 19: రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో యువ టూరిజం క్లబ్బులు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు జిల్లా టూరిజం అధికారి ఎం వెంకటరాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్లబ్బులు రాష్ట్రంలోని స్కూల్స్, ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలలతోపాటు, ప్రొఫెషనల్, వొకేషనల్ విద్యాసంస్థల్లో యువ టూరిజం క్లబ్బులను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి క్లబ్‌లో 25 మందితో కలిపి క్లబ్‌ను ఏర్పాటు చేసుకోవాలని క్లబ్ పర్యవేణకు ఒక టీచర్, లెక్చరర్, కో-ఆర్డినేటర్‌ను నియమించనున్నారు. కలెక్టర్ వీటికి చైర్‌పర్సన్‌గా కొనసాగుతూ ఈ నెల 27 వరల్డ్ టూరిజం డే లోపే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులకు, యువతకు, క్విజ్, వ్యాసరచన, లోగో డిజైన్స్ పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నారు.

ముస్తాబాద్‌లో చీరలు చోరీ

ముస్తాబాద్, సెప్టెంబర్ 19: మండల కేంద్రంలో చీరలు చోరీకి గురయ్యాయి. పోలీసు ఠాణాకు కూత వేటు దూరంలో చీరలు దొంగతనం చేశారని బాధితులు పేర్కొన్నారు. బట్టల దుకాణానాకి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు దాదాపు పది చీరలు ఎత్తుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

వినాయక నిమజ్జనంలో ఇరువర్గాల ఘర్షణ

మల్యాల, సెప్టెంబరు 19: మల్యాలలో వినాయక నిమజ్జనం సందర్భంగా బుధవారం అర్ధరాత్రి యువకుల మధ్య ఘర్షణ నెలకొని పరస్పరం దాడులకు దారితీసింది. డీజే సౌండ్ సిస్టంతో ఊరేగింపు నిర్వహిస్తూ నిమజ్జనం చేస్తున్న యువకుల మధ్య ఓ సినిమా పాటపై వివాదం నెలకొని వాగ్వాదం చోటు చేసుకోగా, కాసేపటికే గొడవ పెద్దదిగా కాగా ఇరువర్గాలకు చెందిన యువకులు దాడికి పాల్పడడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చి గొడవను ఆపేయించారు. అలాగే నూకపల్లిలోనూ ఓ యువకునిపై దాడికి పాల్పడగా ఈ ఘటన పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. అనంతరం ఇరువర్గాలు రాజీపడినట్లు తెలిసింది.

రైతు నాయకుల అరెస్ట్ అన్యాయం

కథలాపూర్, సెప్టెంబరు 19: ప్రభుత్వం రైతు నాయకులను అరెస్ట్ చేసి ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేయడం దారుణమని బీజేపీ కిసాన్ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం మాట తప్పిందని అందుకు నిరసనగా ప్రజాభవన్‌ను ముట్టడించడానికి వెళ్తే నాయకులను అరెస్ట్ చేయడాన్ని ఖండించారు.

కమ్యూనిస్టులు భూపోరాటాలకు సిద్ధం కావాలి

- ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 19: కమ్యూనిస్టులు భూపోరాటాలకు సిద్ధం కావాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ కరీంనగర్ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రెస్‌భవన్‌లో జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల పాత్ర లేదని సాయుధ పోరాట చరిత్ర వక్రీకరణకు గురవుతుందన్నారు. కమ్యూనిస్టులు వాస్తవాలు ప్రజలకు వివరించాలన్నారు. నిజాం రజాకార్ల దౌర్జన్యాలను ఎదిరిస్తు 1947 సెప్టెంబరు 11న ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముగ్దుం మొహియుద్దీన్ పిలుపునిచ్చారన్నారు. సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ లాంటి వారు వీరోచిత పోరాటం చేశారన్నారు. కమ్యూనిస్టు శ్రేణులు జిల్లా, మండల, గ్రామ స్థాయి వరకు సాయుధ పోరాట చరిత్రను వివరించాలన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ బాల మల్లేష్ మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో సాయుధ పోరాటం సువర్ణ అక్షరాలతో లిఖించదగినదన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలన అని, బీజేపి విమోచనమని రకరాల పేర్లతో సాయుధ పోరాట చరిత్రను అపహాస్యం చేస్తున్నాయన్నారు. సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల స్మృతి వనాలు, స్మారక విగ్రహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల కార్యదర్శి మంద పవన్, గుంటి వేణు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కిన్నెర మల్లవ్వ, బీర్ల పద్మ, కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, గోడిశెల తిరుపతిగౌడ్, కాంతాల అంజిరెడ్డి, పైడిపల్లి రాజు, గజ్జి అయిలయ్య, నలువాల సదానందం పాల్గొన్నారు.